జిందగీ
చిత్రాలు
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 14 అక్టోబర్ 2024
www.ntnews.com

కర్మాచరణే ఉత్తమోత్తమం

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్య కర్మణః
శరీర యాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యే ద కర్మణః!
(భగవద్గీత - 3-8)

'అర్జునా! శాస్త్రం విధించిన కర్మలను విధిగా ఆచరించు. కర్మలను ఆచరించకుండుట జడత్వం. జడత కన్నా కర్మాచరణ ఉత్తమం. శరీర పోషణకైనా కర్మాచరణ అవసరం' అని చెబుతున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ. అభిప్రాయాలేవీ లేకుండా జనించిన మనం, వయసు తోపాటు అభిప్రాయాలను, ఊహలను పెంచుకుంటూ అపరిమిత జీవితాన్ని పరిమితం చేసుకుంటాం. ప్రతి వ్యక్తి జీవితానికీ ఒక ప్రయోజనం ఉంటుంది. ప్రయో

జన భరితమైన ఆలోచనలు ఉన్నతస్థితికి చేరేందుకు సహకరిస్తాయి. క్షత్రియుడిగా అర్జునుడి జీవన ప్రయోజనం ధర్మాన్ని నిలపడం. కానీ, వ్యామోహాత్ముడైన అర్జునుడు, వ్యవస్థ ప్రయోజనాన్ని పణంగా పెట్టి ప్రయోజన భంగకరమైన ఆలోచనలను చేస్తూ క్లైబ్యత్వాన్ని ఆశ్రయించాడు. మనసును, శరీరాన్ని ఏకోన్ముఖం చేసి పరిశ్రమించాల్సిన సమయంలో చాపల్యంతో నిర్దేశిత కర్మను చేయననడాన్ని మలినమైన భావనలకు ప్రతీకలుగా చెప్పుకోవాలి.
శరీరం, మనసు, ఉపకరణం, ప్రక్రియ, అదృష్టం..

ఈ అయిదు వ్యక్తి చేసే కర్మల ఫలితాలకు కారణాలు అవుతాయి. మనమంతా 'నేను చేస్తున్నాను' అనే భావనతో, కర్మఫలితాలకు బాధ్యులం అవుతున్నాం. భౌతిక జీవితంలో గృహస్థుగా భార్యాపిల్లల పోషణ, కార్యాలయాలలో అప్పగించిన బాధ్యతలు శ్రద్ధగా నిర్వహించడం శాస్త్ర విహిత కర్మలు. సమాజం వ్యక్తికి జీవనాధారమై నిలుస్తుంది. కాబట్టి సామాజిక బాధ్యతను నిర్వహించడం కర్తవ్యం. అందుకే చేయవలసిన కర్మలను బంధాలుగా భావించడం తప్పవుతుంది. ఇతరుల శ్రమపై ఆధారపడి బతుకుతూ, తాము ఆధ్యాత్మిక జీవన సాధనకై, భౌతిక జీవితాన్ని సన్యసించామని చెప్పుకొంటూ కర్మలను ఆచరించక సోమరిగా బతుకులీడ్చే కర్మసన్యాసులకు భౌతిక జీవితమూ, ఆధ్యాత్మిక జీవితమూ రెండూ ఫలించవు. 'నేను చేస్తున్నాను' అనే భావన అహంకారంగా పరిణామం చెంది, మనలోని అభిప్రాయాలకు, ఇష్టాయిష్టాలకు ప్రతినిధిగా, జీవితం ఇలా ఉండాలని నిర్వచిస్తుంది. మలినమైన అభిప్రాయాల బంధనాలలో చిక్కుకున్న వ్యక్తిలోని సామర్థ్యం తగ్గిపోతుంది. అలాంటి బంధనాలు పిరికితనాన్ని ప్రసాదిస్తాయి. ధైర్యం జీవితాన్ని రసమయం చేస్తుంది. ధైర్యంలేని వ్యక్తి సత్యాన్ని ఆదరించలేడు. విజ్ఞతతో ఆలోచించే వ్యక్తి పరిమితులను దాటి దర్శించగలడు.

'నేను కార్య నిర్వహణలో ఉపకారణాన్ని' మాత్రమే అనే భావనతో నిర్దేశిత కర్మలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో, ఫలితాపేక్ష లేకుండా ఆచరిస్తే అది బంధనాల నుంచి నెమ్మదిగా విముక్తులను చేస్తుంది. శరీరం, మనసు, ఆత్మల సమ్మేళనమే జీవితం. శరీరానికి భయం, ఆకలి, భోగాలపై ఆసక్తి ఉంటుంది. మృత్యు భయం వల్ల ఆకలి కలుగుతుంది. ఆకలిని శాంతింపజేసుకునే ప్రయత్నంలో శరీరం భోగాలను కోరుకుంటుంది. కామాదులకు భోగేచ్ఛ కారణమవుతుంది. మనసుకు నిర్దిష్టమైన పనులు లేకపోయినా గుర్తింపును కోరుకోవడం సహా అనేకమైన కోరికలు ఉంటాయి. దాని కోసం కర్మలను ఆచరిస్తుంది. ఫలితంగా భయాదులు కలుగుతాయి. కర్మాచరణ వల్ల కర్మ ఫలితాలు కలిగి, వాటి అనుభవం కోసం వెంపర్లాట మొదలవుతుంది. అలాగని కర్మలను ఆచరించకుండా ఉండటం వల్ల దేహయాత్రకు విఘాతం కలుగుతుంది. ప్రకృతిపరంగా జరిగే శ్వాస తీసుకోవడం లాంటి కర్మాచరణలైనా జీవితం ఉన్నంత వరకూ తప్పవు. ఇంద్రియాలను నిగ్రహించుకున్నా, మనసు ఊహించుకోవడం ఆపదు. ఊహాపోహలు బంధనాలకు కారణాలు అవుతాయి. ఆత్మకు ఇవేవీపట్టవు. సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది. అందువల్ల, శరీర ధర్మం నడవాలి అంటే కర్తవ్యాన్ని పాలించాలి. ఫలితాన్ని పరమాత్మకు అప్పగించాలి.

... పాలకుర్తి రామమూర్తి

అవమానమే అమృతం

సన్మానాత్ బ్రాహ్మణో నిత్య ముద్విజేత విషా దివ।
అమృతస్యేవ చాకాంక్షే దవమానస్య సర్వదా॥
(నారద పరివ్రాజక ఉపనిషత్తు 3-40)

బ్రహ్మనిష్ఠుడు తనకు ఇతరులు చేసే సన్మానాన్ని విషంలా భావించాలి. అవమానాన్ని ఎల్లప్పుడూ అమృతంలా భావించి కోరుకోవాలి. సన్మానం పొందడంలో విశేషమేమీ లేదు. అవమాన అనుభవమే ఆధ్యాత్మిక సాధన. దానినే సాధకుడు అభ్యసించాలి. అదే సాధనకు గీటురాయి. ఈ ఉపనిషత్ వాక్యానికి అతికినట్టు సరిపోయే ఒక మహాభక్తుని ఉదంతం పరిశీలిద్దాం!
పాండురంగని భక్తుడైన ఏకనాథుడు రోజూ గోదావరిలో స్నానం చేసి వచ్చి దేవతార్చన చేసుకునేవాడు. గిట్టనివారు ఎలాగైనా అవమానించాలని పథకం వేసుకుని ఒక ఆకతాయి పిల్లవాణ్ని ఉసిగొలిపారు. ఏకనాథుడు ఒకరోజు మామూలుగా నదిలో స్నానం చేసి ఒడ్డుకు రాగానే ఆ పిల్లవాడు తుపుక్కున ఉమ్మి వేసినాడు. ఏకనాథుడు నవ్వుతూ కిమ్మనకుండా మళ్లీ స్నానం చేసి వచ్చాడు. మళ్లీ ఆ కుర్రాడు అలాగే చేశాడు. ఈ విధంగా 107 సార్లు జరిగింది. ఏకబిగిన ఉమ్మి వేయడంతో ఆ పిల్లవాని నోరు ఎండిపోయింది. ఏకనాథుడు మాత్రం ఆ ఆకతాయిని పల్లెత్తు మాటా అనలేదు. చివరికి ఆ తెంపరి బాలుడు పశ్చాత్తాపంతో భోరున ఏడుస్తూ ఏకనాథుడి పాదాలపై



ఉపనిషత్ వాక్యం

పడ్డాడు. 'ఫలానా వారు మిమ్మల్ని అవమానించాలని నన్ను పురమాయించార'ని జరిగింది విన్నవించాడు. ఏకనాథుడు ఆ పిల్లవాణ్ని కౌగిలించుకొని 'నాయనా! నీవు నాకు మేలే చేశావు. నీవల్ల ఈ రోజు 108సార్లు గోదావరిలో స్నానం చేసే పుణ్యం దక్కింది! ధన్యవాదాలు' అన్నాడు. అవమానాన్ని భరించే ఏకనాథుని క్షమాగుణం సదా స్మరణీయం, ఆచరణీయం!

... డా.వెలుదండ సత్యనారాయణ



రసమయ రాసం.. రహస్యమయం

మన పోతన 185 మధురిమ వ భాగం

శ్రీమద్భాగవతం భగవల్లీలా రస సాగరం. రస దృష్టితో అపారమైన భాగవతానికి సారం దశమ స్కంధం. అందునా పూర్వార్ధంలోని 'రాస పంచాధ్యాయి'గా ప్రసిద్ధమైన (29 నుంచి 33 వరకు) ఐదుఅధ్యాయాలూ సారాతిసారం. సారసాక్షుడు శ్రీకృష్ణుడు కూడా సారగ్రాహి. ప్రేమశాస్త్రానికి పరాకాష్ఠ అయిన భాగవత పురాణానికి పంచాధ్యాయాలు ప్రాణపంచకం. 'మానవుని చిత్తంలో ఇంతవరకు గుప్తంగా, సుప్తంగా ఉన్న మాధవ భగవానుని దివ్యప్రేమ అనే విత్తం ఈ రాసప్రసంగ అధ్యయన, శ్రవణ, మననాలతో జాగృతమై సువ్యక్తమవుతుంది' - అని భావుక భక్తుల, భాగవత అనురక్తుల అనుభవ సూక్తం. అయితే, రాసలీల ఎంత రసమయమో అంతకంత రహస్యమయం కూడా!

శ్రీమద్భాగవతంలో అత్యధిక ఆక్షేపణకు, అపార్థానికి, ఈసడింపునకు లోనైన ఘట్టాలలో 'రాసలీల' మొట్టమొదటిది. తాను దొంగైతే పొరుగువాణ్ని నమ్మడన్నట్లు, కృష్ణుని తత్త్వ– స్వరూప స్వభావాల అవగాహనా రాహిత్యమే ఇందుకు కారణం. 'కృష్ణస్తు భగవాన్ స్వయం'– కృష్ణుడు ఆత్మారాముడు, పూర్ణకాముడు. సర్వతంత్ర స్వతంత్రుడైన పరమాత్ముడే అయితే ఇంద్రియారాముని వలె కామపరతంత్రుడై పరభామలను పొందడమేమిటి? అని ప్రధాన అధిక్షేపణం...

విషయ(కామా)సక్తి అనే కామల(కామెర్ల) రోగగ్రస్తునికి నిరామయ– భగవదీయ 'రాసలీల' కామలీలగా కనిపించడం ఏమంత ఆశ్చర్యం? భగవల్లీలా విమర్శ చేసేటప్పుడు భగవంతుని దేహం, గుణాలు, కర్మలు (జన్మకర్మచ మే దివ్యం– గీత) అప్రాకృతాలు అనీ, జీవులకు వలె అవి భౌతికాలు కావనీ మరువరాదు. వస్త్రాపహరణ లీల జీవుల అజ్ఞాన ఆవరణ భంగ లీల. రాసలీల జీవ– బ్రహ్మ ఐక్య లీల! శుద్ధ జీవుల పంచ ప్రాణాలు పరబ్రహ్మలో రమించడమే రాసం. రసం ప్రతి మనిషిలోనూ ఉంది. అయితే, అది ఏకాదశ– పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు– ఇంద్రియాలకు ఆవల, అవ్యక్తంగా ఉంది. రస స్వరూపుడైన బాలగోపాలుని ముఖాన జాలువారితే (రాసలీలా విలాస సమయానికి వాసుదేవ కృష్ణుని వయసు పది సంవత్సరాల లోపు) ఆ రసం పదకొండు ఇంద్రియ కుల్యాల– కాలువలలో కూడా ప్రవహిస్తుంది. సర్వేంద్రియాలను చషకాలు– పానపాత్రలుగా చేసికొని, వేణుగానలోలుని ఆ రసపానం చెయ్యాలి. ఇందుకు అనన్య ఆదర్శ మూర్తులు ధన్యలైన గోపకన్యలు– కాంతలు. 'గోభిరింద్రియైః కృష్ణభక్తి రసం పిబంతి ఇతి గోప్యః' ఇంద్రియ పాత్రలతో అతీంద్రియ కృష్ణ భక్తి రసాస్వాదన చేయువారే గోపికలు. దీనివలన మృణ్మయ ఇంద్రియాలు చిన్మయాలవుతాయి. మనసు అమనస్కమవుతుంది. 'మనోనాశో మహోదయః'– మనసు మరణించుటే అనగా మనోలయమే జీవన్ముక్తి. రాసలీల భాగవతానికే ఫలశ్రుతి.

రాస శబ్దం రస శబ్దం నుంచి ఏర్పడింది. 'రసః' అనగా పరబ్రహ్మ. 'రసోవై సః' అని తైత్తిరీయ ఉపనిషత్తు వచనం. ఆనంద స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మకే 'రసః' అని నామం. ఆయన తన నీడలు, స్వరూపాలూ ఐన జీవులతో ఆడే ఈ జగన్నాటకమంతా 'రాసక్రీడే!' రాసలీల కామలీల కాదు, కామ విజయ లీల! భోగలీల కాదు, భగవత్ సంయోగలీల! విషయ విలాస లీల కాదు, హృదయ వికాస లీల! కృష్ణుడు యోగి కాడు, యోగేశ్వరేశ్వరుడు. రాసక్రీడ ఘట్టం విన్నా, చదివినా, చింతన చేసినా కలిగే మహత్తర ఫలం కామ నివృత్తి! 'హృద్రోగ మాశ్వప హినోతి'– అన్నాడు శుక యోగీంద్రుడు. హృదయ రోగం అంటే కామం. అది తొలగిపోతుంది.

ఇంద్ర॥ 'గోపాల కృష్ణుండును గోపకాంతల్
ప్రాపించి క్రీడించిన భంగులెల్లన్
రూపించి వర్ణించి నరుండు హృత్సం
తాపంబులన్ బాయును దత్ప్రసక్తిన్'

ఇలా గోపాలకృష్ణుడూ, గోపికలూ రాసక్రీడ సలిపిన సరణిని ఏ పురుషుడు అభివర్ణిస్తాడో, శ్రద్ధగా ఆకర్ణిస్తాడో అతని సమస్త మనస్తాపాలు తొలగిపోతాయని పోతనామాత్యుని పసిడి పలుకులు. ఈ మాటలు జ్ఞప్తి– స్మృతిలో ఉంటే, 'రాసలీల' కామలీల అనే దుర్భావనకు ఏమాత్రం తావు ఉండదని విజ్ఞప్తి. సర్వేశుడైన వాసుదేవునితో గోపికల భాసుర (జ్ఞానపూర్వకమైన) మానసిక మేళనమే రాసలీల. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'– గీత. జీవుడు అంశ– బిందువు. దేవదేవుడు అంశి– సింధువు. జీవాత్మ అనే రస– బిందువు పరమాత్మ అనే రస సింధువులో ఏకమైపోవడమే 'రాసం'.
శుకముని– పరీక్షిన్మహారాజా! ఇంతలో నిండు పున్నమి వెన్నెలతో దిక్కులను మెండుగా ప్రకాశింపచేస్తూ శారద రాత్రులు తారసిల్లాయి.

ఆ॥ 'కామ తంత్ర టీక కలువల జోక కం
దర్పుడాక విటుల తాల్మి పోక
చకిత చక్రవాక సంప్రీత జనలోక
రాక వచ్చె మేలు రాక యగుచు'

'కామశాస్త్రానికి వ్యాఖ్యాన– వివరణమైనది, కలువలను వికసింప జేసేది, కామ వికారాన్ని విజృంభింపజేసేది, విటుల– జారుల సహనాన్ని మటుమాయం జేసి బేజారు (కంగారు) పరచేది, జక్కవ పిట్టలకు జంకు– బెదురు పుట్టించేది, జన సముదాయానికి ముదం– సంతోషం సమకూర్చేది, తన రాకతో లోకుల కాక(తాపం) పోకార్చుతూ– తొలగిస్తూ అన్ని రకాల మేలు కలిగించే రాకా పూర్ణిమ– నిండు పున్నమి వచ్చింది'. టీక, జోక, డాక, పోక, వాక, లోక, రాక.. ఈ 'క'కార కేకీ (నెమలి) కేరింతల పాటలతో సయ్యాటలాడే ఈ 'ఆటవెలది'– మయూరి మన పోతన సూరి (పండితుని) భూరి మధురిమల గరిమ!

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

అనంగుడు– మన్మథుడు ఇలా అహంకరించాడు... 'సరస్వతీ ప్రసంగంలో– నేను బమ్మ– బ్రహ్మకు కూడా రిమ్మ తెగులు (ఒక్కుమ్మడిగా వ్యామోహం) పుట్టించాను. ముక్కంటి మొదట నన్ను మసి చేసినా క్షీరసాగరమథనం, మోహినీ ప్రసంగంలో– 'మీదై నా కరంబుంట మేల్గాదే' అన్నట్లుగా నాదే పై చెయ్యి అయ్యింది గదా! అహల్యా విషయికంగా ఇంద్రుణ్ని ఓడించాను– మిక్కుటంగా మోహం పుట్టించి మహేంద్రుని కుక్కుటం (కోడి)గా మార్చి అతనిచే 'కూత' పెట్టించాను. దేవగురువు భార్య తార విషయంలో చంద్రునికి ఒకతీరుగా జలతారు కుళ్లాయి (కుచ్చుటోపీ) పెట్టాను. ఇక, వాతాంబు పర్ణాశనులైన– గాలి, నీరు, ఆకులు ఆహారంగా తపస్సు చేసే విశ్వామిత్ర, పరాశర, సౌభరి మొదలైన మునీంద్రులు ఉండనే ఉన్నారు. ఇంక, నా జనకుడు– విష్ణువు కృష్ణుడే మిగిలాడు' అని

మ॥ 'తరుణుల్ గొందరు మూల గేహముల నుద్దండించి రారాక త
ద్విరహాగ్నిం బరితాపమొందుచు మనో వీథిన్ విభున్ మాధవుం
బరిరంభంబులు సేసి జారుడనుచున్ భావించియుం జొక్కి పొం
దిరి ముక్తిన్ గుణ దేహమున్ విడిచి ప్రీతిన్ బంధ నిర్ముక్తలై'

శుకుడు– రాజా! కొందరు గోపకాంతలు నట్టిళ్లలో నుంచి ఒక్కపెట్టుగా ధైర్యంతో వెడలి రాలేక పోయారు. అట్టివారు కృష్ణ విరహాగ్నిలో తపించి– తపించి, ఆ దుఃఖానుభవంతో సర్వ పాప విముక్తి పొందారు. శ్రీపతినే ఉపపతిగా– జారుడని భావిస్తూ తమ మనోవీధులలోనే పరిష్వంగం– ఆలింగనం చేసుకుని పరవశించిపోయారు. ఈ సుఖానువంతో వారి పుణ్యమంతా క్షీణించిపోయింది. పాపపుణ్యరూప కర్మల ఫలంగా వచ్చిన గుణమయ శరీరాలను పరిత్యజించారు. భగవల్లీల – రాసంలో ప్రవేశానికి యోగ్యమైన అప్రాకృత దివ్య దేహాలు పొందారు. (సశేషం)

అమ్మ మాటే శాసనం

ఇస్లాం బోధ

అబ్దుల్ ఖాదర్ జీలానీ (రహ్మాలై) గొప్ప పండితుడు. ముస్లిం సమాజం ఆ మహనీయుణ్ని నిత్యం స్మరించుకుంటుంది. ఆయన బోధనలను గుర్తుచేసుకొని స్ఫూర్తి పొందుతుంది. అబ్దుల్ ఖాదర్ జీలానీ (రహ్మాలై) ఇరాన్‌కు వాయువ్య ప్రాంతంలో ఉన్న 'గీలాన్' ప్రాంతంలోని 'నీఫ్' గ్రామంలో పుట్టారు. తల్లిదండ్రులు ఉమ్ముల్ ఖైర్ ఫాతిమా, అబూ సాలిహ్ మూసా అల్ హసనీ. తల్లి సమక్షంలోనే ప్రాథమిక విద్యను నేర్చుకున్నారు. ఆ తరువాత గీలాన్‌లోనే ఒక మదర్సాలో ఆయనను చేర్పించారు. ఖాదర్ జీలానీ (రహ్మాలై) చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండేవారు. ఏదైనా ఒక్కసారి విన్న విషయాన్ని ఆయనలా గుర్తుంచుకునేవారు. అతిచిన్న వయసులోనే ఆయన అక్కడి మదర్సా విద్యను పూర్తి చేసుకున్నారు. ఆయన పదకొండేళ్లకు చేరేసరికి తండ్రిని కోల్పోయారు. బాగోగులన్నీ తల్లి చూసుకునేవారు. కొడుకు భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దేందుకు ఆమె ఎంతగానో పాటుపడ్డారు.

అబ్దుల్ కాదర్ జీలానీ (రహ్మాలై)ని దివ్య ఖురాన్ విద్య నేర్చుకోవాల్సిందిగా బాగ్దాగ్‌కు పంపాలని అనుకుంది అతని తల్లి. తాము ఉండే గీలాన్ నుంచి బాగ్దాద్‌కు 40 మైళ్ల దూరం. పిల్లాడికి అన్ని జాగ్రత్తలూ చెప్పి ప్రయాణానికి సిద్ధం చేసింది. కుర్రాడి చొక్కాలోపల జేబులో 40 దినార్లు ఉంచి పైనుంచి కుట్లు వేసింది. 'నాన్నా! ప్రాణాల మీదికి వచ్చినా అబద్ధం చెప్పొద్దు' అని హితవు చెప్పింది. బాగ్దాద్‌కు బయల్దేరాడు జీలానీ. దట్టమైన అడవి గుండా వెళ్తూ మార్గంలోని ఓ బిడారుకు చేరుకున్నాడు. అదే సమయంలో ఓ బందిపోటు ముఠా ఆ బిడారుపై దాడికి దిగింది. అందరినీ నిలువునా దోచుకున్నారు దొంగలు. జీలానీని చూసిన దొంగలు 'నీ దగ్గర ఏముందో చెప్పు?' అని గద్దించారు. ఆ కుర్రవాడు తడుముకోకుండా 'నా దగ్గర 40 దీనార్లున్నాయి' అని చెప్పాడు. ఆ మాటకు ఆశ్చర్యపోయిన దొంగలు పిల్లాడిని తమ ముఠా నాయకుడి దగ్గరికి తీసుకెళ్లారు. బందిపోటు నాయకుడి ముందు కూడా జీలానీ అదే సమాధానం ఇచ్చాడు. 'మరైతే ఆ దీనార్లు ఎక్కడ?' అడిగాడు ముఠానాయకుడు. 'చంక కిందిభాగంలో చొక్కా



లోపలి జేబులో కుట్టి ఉన్నాయి' అని చెప్పాడు. 'నా దగ్గరేమీ లేవు అంటే నీ దీనార్లు నీకు మిగిలేవి కదా?' అని సందేహంగా అడిగాడు ముఠా నాయకుడు.
'ఎట్టి పరిస్థితుల్లోనూ అబద్ధం చెప్పకూడదని మా అమ్మ చెప్పిందండీ. అమ్మ మాటను జవదాటకూడదు కదా' అన్నాడు జీలానీ. ఆ మాటలకు ముఠా నాయకుడికి కనువిప్పు కలిగింది. వెంటనే ఆ దోపిడీ దొంగలు ఆ కుర్రాడి చేతులపై చేయి వేసి జీవితంలో ఎన్నడూ దోపిడీలకు, దొంగతనాలకు పాల్పడమని ప్రతిజ్ఞ చేశారు. బందిపోటు ముఠా పశ్చాత్తాపంతో కుంగిపోయేలా చేసిన జీలానీ బాగ్దాద్ చేరుకొని, విద్యావంతుడిగా ఎదిగారు. గొప్ప పండితుడిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారు. ముస్లిమ్ సముదాయానికి ఆదర్శమూర్తిగా నిలిచారు. ఏటా ఆయన జయంతి, వర్ధంతులను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు ముస్లిమ్‌లు. ఈ నెల 14న ఆయన వర్ధంతి. ఈ సందర్భంగా రబీ ఉస్సాని నెల అంతా కూడా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇస్లామ్ సమాజానికి ఆయన చేసిన సేవలను తలుచుకుంటారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

పశ్చాత్తాపం కీర్తనా దీపం

క్రీస్తు సందేశం

కీర్తనలు అనే సరికి మనకు బైబిలు గ్రంథంలో.. దావీదు మహారాజే గుర్తొస్తాడు. మహారాజు స్థాయిలో ఉండి కూడా, ఒక సామాన్యునిగా మారిపోయి దేవునిపై అన్ని కీర్తనలు రాయడం ఓ గొప్ప సంగతి. అందుకు బలమైన కారణం ఒకటి ఉండి తీరాలి.
ఈ దావీదు మహారాజు సమైక్య యూదా సామ్రాజ్యానికి రెండో మహారాజు. క్రీస్తుకు వెయ్యేండ్లు ముందటి వాడు. క్రీస్తు ప్రభువు ఆ మహారాజు వంశీయుడు, వారసుడు. ఆయన రాసిన కీర్తనలు ఇప్పటికీ చిరంజీవులే. వాటి ఆయుష్షు మూడు వేల సంవత్సరాలకు పైబడే. ఆయనలోని బాధాతప్త హృదయం నుంచి వందల కొద్ది కీర్తనలు వెలువడ్డాయి. అంతటి మహారాజు బాధతో కుంగిపోవలసినంతటి దుర్ఘటన ఏమై ఉంటుందీ ? ఏ సౌకర్యానికైనా కొదవలేని ఆ మహారాజు భయపడింది నైతిక విలువలకు. సంఘానికి. పాపభీతికి. తనను నడిపించిన దైవానికి. అవును ఆయన పాపం చేశాడు. చేసిందాన్ని ఒప్పుకోవడం నిజాయితీ. ఒప్పుకొన్న దానికి పశ్చాత్తాప పడటం గొప్ప సంస్కారం. ఇక మీదట దాన్ని కనుసన్నల్లోకి రానీయకుండా జాగ్రత్త పడటం, పశ్చాత్తాపపడటం మహోత్కృష్టం. ఈ మూడూ అలా ఉంచితే , ఆ విరిగి నలిగిన బాధాతప్త హృదయాన్ని అక్షర రూపంలో కీర్తనలుగా పాడుకోవడం నాలుగో విశేషం. ఇంతకూ ఆ మహారాజు చేసింది అంతటి తప్పా అంటే, అది తప్పే కాదు . చాలా ఘోరమైన పాపం. అంతకుమించింది



మరొకటి లేనే లేదు. అన్ని తప్పులూ అందులోనే ఇమిడి పోయాయని చెప్పక తప్పదు. సంఘటనాత్మకంగా ఏర్పడినప్పటికీ.. అదో పీడకల. తన కోటలోని ఒక ఉద్యోగి భార్యపై అనుకోని రీతిగా ఆకర్షితుడు కావడం, ఆమెను బలవంతంగా కోటకు రప్పించుకొని , తన కామవాంఛను తీర్చుకోవడం– ఇదొక దోషం. అంతటితో ఆగక, ఆమె భర్త మరణానికి బాహ్యంగా ప్రధాన కారకునిగా ఉండడం అనేది మరో పాపం.
ఇవి ఆయన చేసిన రెండు పాతకాలు. ఒకటి అత్యాచారం. మరొకటి హత్య. రాజ్య సింహాసనంపై కూర్చున్న మహాప్రభువు.. మానవాధమునిగా పతనమై పోయాడు. తను చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది దేవుడి ముందు మోకరిల్లి దుఃఖించాడు. ఆ దుఃఖంలోనుంచి పుట్టుకొచ్చిన గీతాలు, అగ్ని భావ మహా ప్రవాహాలు. అవే దావీదు కీర్తనలు. దేవుని ఔన్నత్యాన్ని ప్రకటించేవి. ఆయన ప్రేమను స్తుతించేవి. మానవుడి దౌర్బల్యాన్ని దేవుడి ముందు ప్రకటించుకునేవి. విషాదకరమైన ఈ లౌకిక జీవన సమరంలోంచి తప్పించమని దేవుణ్ని వేడుకొనేవి. ప్రపంచ ప్రసిద్ధ సాహితీ వనంలో వాడని పరిమళ పుష్పాల్లా నిత్యం గుబాళించేవి. మానవుడు ఎంత ఎదిగినా దేవుడి ముందు ఒదిగి ఉండాలని చాటి చెబుతాయివి.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024